


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

సోమవారం 25 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 357 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## తమిళనాడు మంత్రి పి. విశ్వనాథన్‌కు మంత్రి పొంగులేటి ఘన సన్మానం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 25, ప్రతినిధి: తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి పి. విశ్వనాథన్ ఆదివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి మంత్రి పొంగులేటిని సత్కరించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా వేలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించి తమిళనాడు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న పి. విశ్వనాథన్‌ను శాలువా, పూల మొక్కతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తమిళనాడులో దాదాపు 59 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తరఫున మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరింత ప్రజాసేవ చేయాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశ్వనాథన్ కృషి చేయాలని ఆకాంక్షించారు.

## తమిళనాడు మంత్రి పి. విశ్వనాథన్‌కు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 25, ప్రతినిధి: ఇటీవల తమిళనాడు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పి. విశ్వనాథన్ జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పి. విశ్వనాథన్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. తమిళనాడు మంత్రివర్గంలో స్థానం దక్కించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేసిన సీఎం, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ భేటీలో పరస్పర అభివృద్ధి, ప్రజా సంక్షేమ అంశాలపై చర్చించినట్లు సమాచారం.

## బీసీ గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలల తొలి విడత సీట్ల ఫలితాలు విడుదల

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 25, ప్రతినిధి: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయాల సొసైటీ ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల ప్రవేశాల తొలి విడత ఫలితాలను సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఫలితాలు, సీట్ల కేటాయింపు వివరాలను అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష లేకుండానే పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో హాజరై ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040-23328266 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



## ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 25, ప్రతినిధి: రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు తదితరులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరిగిందని, అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు 8 వేల 749 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే 21 కోట్ల గోనె సంచులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచామని, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరుకల్లా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని, సరిహద్దు జిల్లాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి వరి, జొన్నలు, మొక్కజొన్న రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. తాలు, తరుగు విషయంలో రైస్ మిల్లర్లు, దళారులు రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేసి రైతులకు నగదు చెల్లింపులు త్వరగా జరిగేలా చూడాలని ఆదేశించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో తప్పుడు ప్రచారాలను ఖండించాలని, ప్రతికూల వార్తలపై అధికారులు వెంటనే స్పందించాలని, రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన అంశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, సరిపడా హమాలీలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. గతంలో రైతులు నగదు చెల్లింపుల కోసం నెలల తరబడి వేచి ఉండేవారని, ప్రస్తుతం వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణ చర్యలు చేపడుతున్నామని, వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పంచాయతీరాజ్-గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్‌లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30 వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష నిర్వహించారు. గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల శంకుస్థాపనలు, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళా మండల సమాఖ్య సమావేశాలు, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.



## రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ‘సంజీవని’ అమలు: ప్రజారోగ్యమే లక్ష్యం

సందేశం టైమ్స్, అమరావతి, మే 25, ప్రతినిధి: ‘సంజీవని’ సిటిజన్ వెల్‌నెస్ మిషన్ తన మనసుకు ఎంతో దగ్గరైన ప్రాజెక్టు అని పేర్కొంటూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. సంపద కంటే ఆరోగ్యం ఉన్నవారే అదృష్టవంతులని, అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పారని గుర్తుచేశారు. సమాజం బాగుండాలంటే ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, అందుకోసమే ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ‘సంజీవని’ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన సంజీవని ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని, ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. వ్యక్తిగత డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా ప్రజారోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఇంటి వద్దే 42 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి నివేదికలు అందించడం, డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు ఇవ్వడం, సంజీవని కార్డు ద్వారా వ్యక్తిగత ఆరోగ్య వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచడం జరుగుతోందన్నారు. సంజీవని కేవలం సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదని, అత్యుత్తమ డిజిటల్ ప్రజారోగ్య వ్యవస్థగా రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. ఈ వినూత్న విధానం విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యం మరింత భద్రంగా ఉంటుందని తెలిపారు.

## రాయలసీమలో 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రజలకు అంకితం



సందేశం టైమ్స్, రాయలసీమ, మే 25, ప్రతినిధి: పారిశ్రామిక అనుమతుల వేగంతో పాటు అమలు సామర్థ్యంలో కూడా ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. రాయలసీమ ప్రాంతంలో ఎస్‌ఏఈఎల్ సంస్థ నిర్మించిన 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేశారు. రూ.3 వేల కోట్ల పెట్టుబడితో కేవలం 11 నెలల రికార్డు సమయంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం రాష్ట్ర అభివృద్ధి దిశలో కీలక ముందడుగుగా అభివర్ణించారు. ఈ భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు ద్వారా పునర్వినియోగ శక్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలుస్తోందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంతో ఉపాధి అవకాశాలు, ప్రాంతీయ అభివృద్ధి, కొత్త పారిశ్రామిక అవకాశాలు విస్తరించనున్నాయని పేర్కొన్నారు. రికార్డు సమయంలో ప్రాజెక్టును పూర్తి చేసిన ఎస్‌ఏఈఎల్ సంస్థ ప్రతినిధులను అభినందిస్తూ ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా మరిన్ని ప్రాజెక్టులు రాష్ట్రంలో రావాలని ఆకాంక్షించారు.

# మే 25 నుంచి 30 వరకు మహిళా ఆర్థిక వారోత్సవం నిర్వహణ




సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 25, ప్రతినిధి: మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతం లక్ష్యంగా మే 25 నుంచి 30 వరకు జిల్లాలో మహిళా ఆర్థిక వారోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి దోహదపడే విధంగా అవగాహన కార్యక్రమాలు, రుణ మేళాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టనున్నట్లు తెలిపారు. మే 25న అన్ని ఏఎల్ఎఫ్‌లు, టీఎల్ఎఫ్‌ల స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మహిళా ఆర్థిక వారోత్సవంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. మే 26 నుంచి 30 వరకు మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనలు, బ్యాంకు అనుసంధాన కార్యక్రమాలు, రుణ మేళాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన, మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా వ్యాపారవేత్తలకు అవసరమైన నమోదు ప్రక్రియలు, లైసెన్సులు, ప్రభుత్వ పథకాల అనుసంధానంపై ప్రత్యేక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. మే 27న మహిళా వ్యాపారవేత్తలకు మున్సిపాలిటీలలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేవలు అందించనున్నట్లు, మే 28న ఐఎంఎస్ కార్యక్రమాలపై అవగాహనతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 29న రుణ మేళాలు, మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం, రుణాల మంజూరు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, మే 30న పీఎంఎఫ్ఎంఈ పథకం కింద క్రెడిట్ లింక్ సబ్సిడీ రుణాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన మహిళా సంఘాలకు ప్రయోజనాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే ఈ వారోత్సవ కార్యక్రమాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, మెప్మా పీడీ ఇందిరా, పంచాయతీరాజ్ ఈఈ నరసింహులు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రాల్లో వెంటనే వడ్ల కొనుగోలు చేపట్టాలి: బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 25, ప్రతినిధి: నర్సాపూర్ అసెంబ్లీ పరిధిలోని నాగులపల్లి, మూసాపేట గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఐకేపీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలోని ఐకేపీ కేంద్రాల వద్ద నెల రోజులుగా కుప్పల కుప్పలుగా వడ్లు నిల్వ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి వెంటనే స్పందించి కలెక్టర్లకు వారంలోపు వడ్ల కొనుగోలు పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐకేపీ కేంద్రాల్లో గోనె సంచులు, కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. బీజేపీ మెదక్ జిల్లా శాఖ తరఫున రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే రేపటి నుంచి బీజేపీ రాష్ట్ర పార్టీ మూడు బృందాలుగా ఏర్పడి అన్ని ఐకేపీ కేంద్రాలను సందర్శించి రైతులను కలుస్తుందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపట్టేందుకు బీజేపీ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్, నర్సాపూర్ మండల అధ్యక్షులు నీలి నగేష్, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, బూత్ అధ్యక్షులు శ్రీనివాస్, సదానందం, బీజేపీ నాయకులు మహేష్, ప్రశాంత్, మల్లేశం, ప్రవీణ్, భాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పంట అవశేషాల దహనంపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి: డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 25, ప్రతినిధి: పంట అవశేషాల దహనంపై గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ పౌరసరఫరాల శాఖ కార్యాలయం నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ పాల్గొన్నారు. మెదక్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ముఖ్యమంత్రి మాట్లాడుతూ యాసంగి-2026 ధాన్యం కొనుగోళ్లను అనేక సవాళ్ల మధ్య విజయవంతంగా నిర్వహించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని అభినందించారు. భారీ స్థాయిలో వరి దిగుబడి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. మంత్రివర్గం ఇటీవల సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిందని, వెంటనే అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. గతంలో రైతులకు ధాన్యం చెల్లింపులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండేవని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ పాలనలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పంట అవశేషాలను పొలాల్లో కాల్చకుండా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. ప్రతి గ్రామంలో టామ్‌టామ్ ద్వారా వచ్చే 15 నుంచి 30 రోజుల పాటు ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అవగాహన కార్యక్రమాల అనంతరం కూడా పంట అవశేషాలను కాల్చితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయాలని సూచించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే చివరి నాటికి ధాన్యం కొనుగోలు 100 శాతం పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీలు, రవాణా సమస్యల పరిష్కారానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పౌరసరఫరాల శాఖ తరపున అవసరమైన ఖర్చులను రీయింబర్స్‌మెంట్ చేస్తామని తెలిపారు. పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేసిన డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి అండర్‌టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయాలని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సన్‌ఫ్లవర్ కొనుగోళ్లకు వెంటనే చర్యలు చేపట్టాలని, చివరి గింజ వరకు పంట కొనుగోలు జరిగేలా చూడాలని సూచించారు. వరి కొయ్యలను కాల్చకుండా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానంద, డీఎస్పీలు, రైస్‌మిల్లుల యజమానులు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.



# బీఎస్పీ పార్టీని మెదక్ పార్లమెంట్‌లో బలోపేతం చేయాలి: బోడపట్ల ఈశ్వర్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 25, ప్రతినిధి: బహుజన సమాజ్ పార్టీని మెదక్ పార్లమెంట్ పరిధిలో మరింత బలోపేతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోన్-3 చీఫ్ జోన్ ఇంచార్జ్ బోడపట్ల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్ పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన బీఎస్పీ మెదక్ పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ముఖ్యంగా సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేసి పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. దేశంలో బహుజనుల హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ బహుజన సమాజ్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీ వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో బహుజన రాజ్యం స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, జోన్ ఇంచార్జ్ లింగంపల్లి యాదగిరి, జోన్ ఇంచార్జ్ రవీందర్ నాయక్, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ డప్పు ప్రేమ్‌కుమార్, మెదక్ జిల్లా అధ్యక్షులు స్వామిదాస్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పుల్లూరు ఉమేష్, మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర శంకర్, జిల్లా ఈసీ సభ్యుడు సందీప్ గౌడ్, జిల్లా కోశాధికారి ఆనంద్ ఆశిష్, సిద్దిపేట అసెంబ్లీ ఇంచార్జ్ పంగ బాబు, కొమ్ము భాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# మే 25 నుంచి 30 వరకు మహిళా సంక్షేమ వారోత్సవం నిర్వహణ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 25, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుంచి 30 వరకు జిల్లాలో "మహిళా సంక్షేమ వారోత్సవం" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, స్వయం సహాయక సంఘాల బలోపేతం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక పురోగతికి దోహదపడే విధంగా అవగాహన కార్యక్రమాలు, రుణ మేళాలు, మార్కెటింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 25న అన్ని ఏఎల్ఎఫ్‌లు, టీఎల్ఎఫ్‌ల స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మహిళా ఆర్థిక వారోత్సవంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలు, ఏఎల్ఎఫ్ సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. మే 26 నుంచి 30 వరకు మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తుల ప్రదర్శనలు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమాలు, రుణ మేళాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన, మార్కెటింగ్ అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా వ్యాపారవేత్తలకు అవసరమైన రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు, ప్రభుత్వ పథకాల అనుసంధానంపై ప్రత్యేక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. మే 27న మహిళా వ్యాపారవేత్తలకు మున్సిపాలిటీలలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సేవలు అందించనున్నట్లు తెలిపారు. మే 28న ఐఎంఎస్ కార్యక్రమాలపై అవగాహనతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మే 29న రుణ మేళాలు, మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం, స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మే 30న పీఎంఎఫ్ఎంఈ పథకం కింద క్రెడిట్ లింక్ సబ్సిడీ రుణాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన మహిళా సంఘాలకు ప్రయోజనాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడే ఈ వారోత్సవ కార్యక్రమాలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.





# కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొడతాం: సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 25, ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను కార్మికులు ఐక్యంగా తిప్పికొడతారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సీఐటీయూ మెదక్ జిల్లా కమిటీ సమావేశం కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు బాలమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చుక్క రాములు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెడుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందన్నారు. కార్మికులు దీర్ఘకాల పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్‌ను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని తెలిపారు. లేబర్ కోడ్స్ అమలైతే కార్మికుల హక్కులు తీవ్రంగా దెబ్బతింటాయని, అవి కార్మికుల పాలిట ఉరి తాళ్లుగా మారతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ లేబర్ కోడ్స్ అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన కనీస వేతనాల్లో శాస్త్రీయత కనిపించడం లేదని విమర్శించారు. మే 30న సీఐటీయూ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఈ నెలాఖరులోగా వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 25, ప్రతినిధి: జిల్లాలో అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లు, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30 వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని, వరి, మొక్కజొన్న కొనుగోళ్లను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మహిళా సంక్షేమ వారోత్సవాల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి షెడ్యూల్ మేరకు కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ, సివిల్ సప్లై డీఎం జయశ్రీ, మెప్మా అధికారి రామాచారి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.




## చిలపల్లి వరుస చోరీల కేసు ఛేదన.. కోటి 35 లక్షల ఆస్తి స్వాధీనం

సందేశం టైమ్స్, మెదక్, మే 25, మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్: పెద్దశంకరంపేట మండలం చిలపల్లి గ్రామంలో జరిగిన వరుస ఇళ్ల చోరీల కేసులను మెదక్ పోలీసులు వేగంగా ఛేదించారు. మొత్తం ఐదు ఇళ్లలో జరిగిన చోరీలకు సంబంధించి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, కోటి 35 లక్షల రూపాయల విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా నిందితుడు పాల్పడిన మొత్తం 17 చోరీ కేసులు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన పోలీసు బృందాలను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించి రివార్డులు అందజేశారు.

## మరో అనాధ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన ఏమ్‌డీఆర్ ఫౌండేషన్



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 25, ప్రతినిధి: బీహెచ్ఈఎల్ సమీప ప్రాంతంలో సంచరిస్తూ జీవనం సాగిస్తున్న సుమారు 60 సంవత్సరాల వృద్ధుడు మృతి చెందగా, అతనికి సంబంధించిన ఎటువంటి వివరాలు లభించకపోవడంతో ఏమ్‌డీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించగా, ఆదివారం సేవా సంస్థ సభ్యులు చివరి సంస్కారాలు నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా అనాధ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుతున్న ఏమ్‌డీఆర్ ఫౌండేషన్ ఇప్పటివరకు సుమారు 690 అనాధ మృతదేహాలకు చివరి సంస్కారాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. "చివరి ప్రయాణంలో కూడా ఎవ్వరూ అనాధలు కాకూడదు" అనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

## స్వయం ఉపాధికి చేయూతనిచ్చిన ఎమ్‌డీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్




సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 25, బి. డేవిడ్: పటాన్చెరు పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన ఓ మహిళ కుటుంబ ఆర్థిక ఇబ్బందులను వివరించేందుకు ఎమ్‌డీఆర్ ఫౌండేషన్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అనంతరం ఆమె తన సమస్యలను ఎమ్‌డీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్‌కు వివరించారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న మాద్రి పృథ్వీరాజ్ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుట్టు మిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సాధ్యమైనంత సహాయం అందించేందుకు ఎమ్‌డీఆర్ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ కుటుంబాలకు అండగా నిలవాలని తమ లక్ష్యమని తెలిపారు. అవసరంలో ఉన్న వారికి ఎమ్‌డీఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. సహాయం అందుకున్న మహిళ తనకు ఉపాధి మార్గాన్ని చూపిన ఎమ్‌డీఆర్ ఫౌండేషన్‌కు, మాద్రి పృథ్వీరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలను సమకూర్చాలి: రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్



సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం, మే 25, ప్రతినిధి: ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలకు తగినంత లారీలను వెంటనే సమకూర్చాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందోల్ మండలం రామసానిపల్లి గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి సరిపడా లారీల లభ్యత లేక రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్తపల్లి, తాండా సహా మూడు గ్రామాల రైతులు వడ్లు తెచ్చి విక్రయిస్తున్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 12 లారీలే తరలించారని, ఇంకా సుమారు 15 లారీలకు పైగా ధాన్యం నిల్వగా ఉందని చెప్పారు. వర్షం వస్తే తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సెంటర్‌లో కేవలం 7 మంది లేబర్‌తోనే కొనుగోళ్లు జరుగుతుండటంతో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడంతో ఐకేపీ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సంచుల కొరత కూడా తీవ్ర సమస్యగా మారిందని తెలిపారు. వెంటనే అదనపు లారీలు, లేబర్ సౌకర్యం కల్పించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. కొనుగోలు చేసిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని, కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, వర్షం నుండి రక్షణ ఏర్పాట్లు, రాత్రివేళల్లో వసతి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతిలో నిర్లక్ష్యం వహించడంతో లారీలు ఆలస్యం అవుతున్నాయని, అలాంటి మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ప్రభాకర్, నరేందర్ గౌడ్, సాయిలు, సంజీవులు, యాదయ్య, రాములు, సుధాకర్, శ్రీనివాస్, నర్సింలు, రాములు, ఊశయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంగ్వార్ చెక్‌పోస్టులో అక్రమ పశువుల రవాణా భగ్నం.. 7 పశువులు స్వాధీనం






సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా గంగ్వార్ ఎక్స్ రోడ్ చెక్‌పోస్టులో హద్నూర్ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి అక్రమ పశువుల రవాణాను భగ్నం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న KA 38 A 8231 నంబర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 4 ఎడ్లు, 3 ఆవులు ఉన్నట్లు గుర్తించారు. హద్నూర్ ఎస్ఐ సుజిత్ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో పశువుల రవాణాకు సంబంధించిన ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. బీదర్ నుంచి జహీరాబాద్‌కు బక్రీద్ పండుగ కోసం పశువులను తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపినట్లు సమాచారం. సంఘటనా స్థలానికి వెటర్నరీ డాక్టర్ చేరుకుని పశువులను పరిశీలించారు. అనంతరం డ్రైవర్ బల్బీం, క్లీనర్ ఖురేషీతో పాటు యజమానులు అజ్గర్, మతాబ్‌లపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పశువులను సంగారెడ్డి పశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. అక్రమ పశువుల రవాణాపై ఎలాంటి రాజీ ఉండదని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు మరింత కట్టుదిట్టం చేస్తామని ఎస్ఐ సుజిత్ హెచ్చరించారు.

## నల్ల పోచమ్మ ఆలయానికి సీసీ కెమెరాలు బహుకరణ







సందేశం టైమ్స్, మనూర్ మండలం, మే 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయానికి నేత్ర సెక్యూరిటీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో 3 సీసీ కెమెరాలను బహుకరించారు. దుడగొండ గ్రామానికి చెందిన దాత CH విష్ణు స్వయంగా ఆలయ ప్రాంగణంలో కెమెరాల ఏర్పాటు పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు సిద్ధ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దాతను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ భద్రతను మరింత బలోపేతం చేసే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు కావడం ఆనందదాయకమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయానికి కెమెరాలు అందించి ఫిట్టింగ్ పనులు పూర్తి చేసిన దాత CH విష్ణు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## న్యాల్కల్‌లో పైపులైన్ వివాదం.. అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ వాసుల ఆగ్రహం



సందేశం టైమ్స్, న్యాల్కల్, మే 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండల కేంద్రంలోని 5వ వార్డు శ్రీరామ్ నగర్ కాలనీలో డ్రైనేజ్ పైపుల అంశంపై ఆదివారం తీవ్ర వివాదం చోటుచేసుకుంది. స్థానికులకు చెందిన సున్నపు శివశంకర్ కొత్త ఇల్లు నిర్మాణ సమయంలో జేసీబీ సహాయంతో పాత డ్రైనేజ్ పైపులను పూర్తిగా తొలగించినట్లు కాలనీ వాసులు ఆరోపించారు. తొలగించిన పైపులకు బదులుగా కొత్త పైపులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినా, ఏడు నెలలు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఇదే విషయంపై బిచ్చి రెడ్డి కుటుంబానికి చెందిన పద్మావతి ప్రశ్నించగా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసినట్లు సమాచారం. కొంతసేపు కాలనీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా స్థానికులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రామపంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదులు చేసినప్పటికీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి స్పందించలేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చిన్న సమస్య పెద్ద వివాదంగా మారిందని ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేశారు.

## ఇంద్రేశం మున్సిపాలిటీలో రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన




సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 25, ప్రతినిధి: పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం పెద్ద కంజర్ల, చిన్న కంజర్ల, ఐనోల్, ఇంద్రేశం, రామేశ్వరం బండ, బచ్చు గూడెం తదితర వార్డులలో సుమారు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు సహా వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక మున్సిపల్ పాలక వర్గంతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ కుషాంగుల ప్రమీల, వైస్ చైర్మన్ పట్లోళ్ల హరీష్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు పట్లోళ్ల శివారెడ్డి, కౌన్సిలర్లు అంతిరెడ్డి, బండి హరి శంకర్, రాచమల్ల అనిల్ గౌడ్, వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాకూర్‌లో ఘనంగా 2011 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 25, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గంలోని డాకూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు. ముఖ్యంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు సార్, మాంజ నాయక్ సార్, భవాని మేడం, అమృత మేడం పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ నాటి విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడటం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ గురువులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి పాదాభివందనం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 2011 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భర్తను హత్య చేసి పొలంలో పాతిపెట్టిన భార్య.. ప్రియుడితో కలిసి దారుణం






సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామంలో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఓ భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి పొలంలో పాతిపెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం ముత్యంరెడ్డికి కల్పనతో వివాహం జరిగింది. కల్పన నారాయణఖేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తుండగా, చింటూ అనే వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి కల్పన, ప్రియుడు చింటూతో కలిసి హత్యకు పథకం రచించినట్లు సమాచారం. అనంతరం ఇద్దరూ కలిసి ముత్యంరెడ్డిని హత్య చేసి మనూరు మండలం ఎల్గోయి-అతిమ్యాల్ గ్రామ శివారులో జేసీబీ సహాయంతో గొయ్యి తవ్వి మృతదేహాన్ని పాతిపెట్టినట్లు వెల్లడైంది. ఆ తర్వాత భర్త కనిపించడం లేదంటూ కల్పన పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానంతో విచారణ జరిపిన పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించగా ఆమె నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిసింది. హత్య జరిగిన తొమ్మిది రోజుల తర్వాత మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు కేసు నమోదు చేసి నిందితులు కల్పన, చింటూపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నారాయణఖేడ్ పోలీసులు తెలిపారు.

# జిల్లాలో 65 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి.. మరో 10 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తాం: కలెక్టర్ ప్రతిమా సింగ్




సందేశం టైమ్స్, మెదక్, మే 25, ప్రతినిధి: మెదక్ జిల్లాలో ఇప్పటివరకు సుమారు 65 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన కొనుగోళ్లను వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని ఆమె పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన వేగవంతంగా కొనసాగిస్తున్నామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.జిల్లాలో ఇప్పటివరకు 50134 మంది రైతుల నుండి మొత్తం 2,41,574.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. 34,460 రైతుల ఖాతాల్లో రూ.379.47 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన చెల్లింపులు కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా జమ అవుతాయని చెప్పారు.కొనుగోలు ప్రక్రియ వేగవంతం కోసం జిల్లాలో 10 ఇంటర్మీడియట్ గోడౌన్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ లోడింగ్-అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తిగా అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులకు తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.మరో 10 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రోజువారీ లక్ష్యాల ఆధారంగా మిగిలిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని తెలిపారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ ప్రతిమా సింగ్ వివరించారు.

# టేక్మల్ మండల రైతుల వడ్లు తరలింపులో సమస్య.. కుసంగి రైస్ మిల్ ముందుకు వచ్చి హామీ



సందేశం టైమ్స్, మెదక్, మే 25, ప్రతినిధి: టేక్మల్ మండలంలోని రైతుల వడ్లు ఇప్పటివరకు సొసైటీ నుంచి తరలించని పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. డీఎస్ఓ ఆదేశాల మేరకు నిల్వల తరలింపు విషయంలో అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కుసంగి రైస్ మిల్ ఓనర్ హయుబ్ ఖాన్ స్పందించారు. వర్షాకాలం కారణంగా రైతులు నష్టపోకూడదని మానవ దృక్పథంతో సొసైటీలో ఉన్న టేక్మల్ రైతుల వడ్లను తమ మిల్లుకు తీసుకుని కొనుగోలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వర్షాల ముందు కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# పంట అవశేషాల దహనంపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలి – డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క







సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 25, ప్రతినిధి: పంట అవశేషాల దహనంపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఖమ్మం కలెక్టరేట్ నుంచి పాల్గొనగా, హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు, అలాగే జిల్లా కలెక్టరేట్‌ల నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ యాసంగి-2026 ధాన్యం కొనుగోళ్లు అనేక సవాళ్ల మధ్య కూడా విజయవంతంగా కొనసాగుతున్నాయని, రైతులకు 24 గంటలలోనే చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు, పంట కోతల అనంతరం పొలాల్లో కొయ్యలు కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుందని, పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొంటూ గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా 15 నుంచి 30 రోజులపాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని, అవగాహన కల్పించిన తర్వాత కూడా దహనం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయాలని ఆదేశించారు, ఇటీవల మంత్రివర్గ సమావేశంలో సన్‌ఫ్లవర్ పంట కొనుగోలుకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో వెంటనే అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు, హమాలీలు, రవాణా సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు, డేటా ఎంట్రీ చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమవుతున్నాయని తెలిపారు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ చివరి గింజ వరకు కొనుగోళ్లు జరగాలని, వరి కొయ్యలు కాల్చకుండా చర్యలు తీసుకోవాలని సూచించగా, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గోదాముల కొరత ఉన్నచోట ప్రత్యామ్నాయ నిల్వ సౌకర్యాలు ఉపయోగించాలని తెలిపారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు మాట్లాడుతూ మే నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.



# ఎండ తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి – జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 25, ప్రతినిధి: జిల్లాలో మూడురోజులుగా ఎండ తీవ్రత మరియు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు మరియు చిన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు. ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే కారణంగా ఆ సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని తెలిపారు. దాహం లేకపోయినా తరచుగా నీరు తాగడం, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ లవణాల మిశ్రమం తీసుకోవాలని సూచించారు. బయటకు వెళ్లేటప్పుడు కాటన్ దుస్తులు ధరించడంతో పాటు తలకు టోపీ, రుమాలు లేదా గొడుగు ఉపయోగించాలని ఆయన పేర్కొన్నారు. అత్యవసర సేవల కోసం కలెక్టరేట్ కార్యాలయంలో 6281492368 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# జూలై 5న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ భారీ బహిరంగ సభ – లక్ష మందితో విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 25, ప్రతినిధి: తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం నేడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ అధ్యక్షతన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోగా జూలై 5వ తేదీన భువనగిరి జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. సభను కనివిని ఎరుగని రీతిలో లక్ష మందికి పైగా ప్రజలను సమీకరించి విజయవంతం చేయాలని నిర్ణయించారు. సభ నిర్వహణ బాధ్యతలను పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్‌కు అప్పగించారు. సభ ఏర్పాట్ల కోసం పలు కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి విభాగానికి ప్రత్యేక బాధ్యతలు కేటాయించారు. గ్రామ స్థాయి వరకు సమన్వయంతో జనసమీకరణ చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. సభను పార్టీ శక్తి ప్రదర్శనగా మార్చి రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ముద్ర వేసేలా చేయాలని నాయకత్వం ఆకాంక్ష వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, ప్రధాన కార్యదర్శి వేములవాడ మదన్మోహన్ చారి, మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, బెల్లంకొండ నీరజ గౌడ్, భువనగిరి జిల్లా అధ్యక్షులు కొమ్రిశెట్టి నరసింహులు, ఇతర రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.